# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.**
2. **ఆంధ్రప్రదేశ్ లోని వైయస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల్లో ఉపఎన్నికలకు పోలింగ్ మరికొద్దిసేపట్లో ప్రారంభం కానుంది.**
3. **ఆంధ్రప్రదేశ్ లో ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**
4. **తెలంగాణలోని అన్ని జిల్లాలలో ఆయిల్‌పామ్‌ను సాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ తుది ఫలితాలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది.**

=========================

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత–సంస్కృత సమితి, ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సంయుక్తంగా నిన్న విజయవాడలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడుతూ,

వాయిస్..32 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు 15 నుంచి వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 700 సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ –ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి నిన్న సందర్శించి, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు పొందడంలో పౌరులకు ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో సమస్యలపైనా శాస్త్రీయ విశ్లేషణ జరగాలని చెప్పారు. వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా సంబంధిత శాఖలను ఆర్టీజీఎస్ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని వైయస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జిల్లా పరిషత్ – జడ్పీటీసీ స్థానాల్లో ఉపఎన్నికలకు కొద్దిసేపట్లో పోలింగ్ ప్రారంభం కానుంది. ఈ రెండు మండలాల్లో పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. పులివెందుల జడ్పీటీసీలో 15 పోలింగ్ కేంద్రాల్లో 10 వేల 601 ఓటర్లు, అలాగే ఒంటిమిట్ట మండలంలో 30 పోలింగ్ కేంద్రాల్లో 24 వేల 606 ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ రెండు జడ్పీటీసీ స్థానాల్లో 11 మంది చొప్పున అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. పోలింగ్ జరిగే అన్ని చోట్ల వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

మరోవైపు.. పులివెందుల, ఒంటిమిట్ట జడ్.పి.టి.సి. ఉప ఎన్నికలకు సంబందించి పోలింగ్ బూత్ ల ఏర్పాటు ఎన్నికల సంఘం నియమావళి ప్రకారమే జరిగిందని ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వి.అనిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, పోలింగ్ బూత్ లను ఎన్నికల సంఘంమే ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేదని అనిత పేర్కొంటూ,

వాయిస్..33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ బస్సుల్లో మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మహిళలకు స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం అమలుకు సంబంధించిన విధివిధానాలు విడుదలైన సందర్భంగా అమరావతిలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సిబ్బందిని పెంచుతున్నామని చెప్పారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, మెట్రో, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచిత ప్రయాణం అమలులో ఉంటుందన్నారు. దీని ద్వారా లక్షలాది మహిళలు ఉద్యోగాలు, విద్య, వైద్యం వంటి వాటి కోసం ఉచితంగా ప్రయాణించే అవకాశం పొందనున్నారని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రైతుల సమస్యలను పరిష్కారించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. భారత్ ఎగుమతులపై అమెరికా సుంకాల పెంపు ప్రభావంపై పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆక్వా రైతులు కేంద్ర మంత్రికి సమస్యలను వివరించారు. సుంకాల వల్ల ఆక్వా ఉత్పత్తుల ధర తగ్గిందని, ఆక్వా రైతులు ఆందోళన చెందవద్దని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

తెలంగాణలోని అన్ని జిల్లాలలో ఆయిల్‌పామ్‌ను సాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ములుగు జిల్లాలోని ఇంచర్లలో ఆయిల్‌పామ్ పరిశ్రమకు మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో కలిసి ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

రాబోయే 4 సంవత్సరాల్లో అన్ని జిల్లాలలో ఆయిల్‌పామ్ కర్మాగారాలు ఏర్పాటు అవుతాయని, తద్వారా రైతులు 10 నుంచి 15 లక్షల ఎకరాలు పంట వేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతులు ఆయిల్‌పామ్ తో పాటు ఇతర ఉద్యానవన పంటలు వేయాలని మంత్రి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ తుది ఫలితాలు గత రాత్రి విడుదలయ్యాయి. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు అందుబాటులో ఉంచినట్లు డీఎస్సీ కన్వీనర్ ఎం.వి. కృష్ణారెడ్డి వెల్లడించారు. తమ ఫలితాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ apdsc.apcfss.inలో చూడవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత లాగిన్‌లోకి వెళ్లి తుది ఫలితాలతో పాటు స్కోర్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. కాగా మొత్తం 16 వేల 347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మొత్తం 3 లక్షల 36 వేల 307 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. జూన్ 6 నుంచి జులై 2 వరకు 23 రోజుల పాటు ఈ పరీక్షలను నిర్వహించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'హైదరాబాద్‌లో ఆగస్టు 14న నెక్లెస్ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు పదివేల మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. రాష్ట్రంలో 40 లక్షల ఇళ్లపై జాతీయ జెండా ఎగరవేసేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.

---------------------------

బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మీ తెలియజేస్తూ....

వాయిస్.. 21 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ అల్పపీడన ప్రభావంతో రానున్న ఐదు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================